



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ఫుట్‌పాత్‌లు ఆక్రమణ

అనకాపల్లిలో వ్యాపారులు ఇష్టారాజ్యం

- పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లలో గోదాములు ఏర్పాటు
- రోడ్లపైనే వాహనాలు నిలుపుదల
- పాదచారులు నడవడానికి వీలుకాని పరిస్థితి
- ప్రధాన రహదారుల్లో తరచూ ట్రాఫిక్ జామ్
- చోద్యం చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు



ఓ దుకాణం వద్ద రోడ్డుకు అడ్డంగా వ్యాన్‌ను నిలిపేసి సరకు దించుతున్న దృశ్యం



మెయిన్ రోడ్డు పక్కన అడ్డదిడ్డంగా వాహనాల పార్కింగ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌లను చిన్న వ్యాపారి నుంచి పెద్ద వ్యాపారి వరకు ఎవరికి వారు ఇష్టారాజ్యంగా ఆక్రమించేశారు. దుకాణాల ఎదుట రోడ్డుకు ఇరువైపులా వాహనాలను నిలుపుదల చేస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్లపై నడవాల్సి వస్తున్నది. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతున్నది. అయినప్పటికీ మునిసిపల్ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు మాత్రం చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో నిత్యం రద్దీగా వుండే ప్రధాన రహదారుల ఫుట్‌పాత్‌లను వ్యాపారులు ఆక్రమించేశారు. తమ సొంత స్థలంగా భావిస్తూ, పాదచారులు నడవడానికి వీలు లేకుండా సామగ్రి పెట్టుకుని దర్జాగా వ్యాపారాలు చేసుకుంటున్నారు. వాహనాల పార్కింగ్ అస్తవ్యస్తంగా తయారైంది. రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసినా పోలీసులు పట్టించుకోవడంలేదు. రోడ్లు వెడల్పు తక్కువ వుండడం, వాటిల్లో సగానికిపైగా ఆక్రమ ణకు గురవడంతో రహదారులు కుంచించుకు పోయాయి. ఇక పెద్ద వాణిజ్య సముదాయాల్లో సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలి. కానీ ఆయా వ్యాపారులు సెల్లార్లను గోదాములుగా వినియోగించుకుంటున్నారు. ఫలితంగా ఆయా దుకాణ సముదాయాలకు వచ్చే వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేయాల్సి వస్తున్నది. అసలే ఇరుకు రోడ్లు.. ఆపైన ఆక్రమణలతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. పండుగల సమయంలో సమస్య మరింత తీవ్రంగా వుంటున్నది. ప్రస్తుతం సంక్రాంతి పండగ సీజన్ కావడంతో దుస్తులు, చెప్పులు, బంగారం, వెండి వస్తువులు, గృహోపకరణాలు, నిత్యావసర సరకులు కొనుగోలు చేయడానికి స్థానికులతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి రోజూ వేలాది మంది వస్తు న్నారు. దీంతో పట్టణంలో ప్రధాన రహదారులు, దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. నెహ్రూచౌక్ నుంచి ఎన్టీఆర్ కూడలి, మెయిన్ రోడ్డు మీదుగా చిన్న నాలుగురోడ్ల కూడలి వరకు అత్యంత రద్దీగా వుంటున్నది. మెయిన్ రోడ్డును ఆనుకొని వున్న వ్యాపార సంస్థలకు ప్రత్యేకంగా వాహనాల పార్కింగ్‌కు స్థలాలు లేవు. బహుళ అంతస్థుల్లో వ్యాపారాలు నిర్వహిస్తున్న వారు సెల్లార్‌లో వాహనాల పార్కింగ్ అనుమతించాలి. కానీ ఇక్కడ సెల్లార్లన్నీ గోదాములుగా లేకపోతే సొంత అవసరాలకు వినియోగిస్తున్నారు. దీంతో ఆయా దుకాణాలకు వాహనాల్లో వచ్చిన వినియోగదారులు తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేసుకోవాల్సి వస్తున్నది. మరికొన్ని వాణిజ్య సముదాయాలకు కనీసం సెల్లార్లు కూడా లేవు. గ్రామాల నుంచి వివిధ రకాల వస్తువులు కొనుగోలు చేసేందుకు వచ్చేవారు ద్విచక్రవాహనలు, కార్లను రోడ్లపైనే నిలి పేస్తున్నారు. దీంతో ప్రధాన రహదారుల్లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు తరచూ ట్రాఫిక్ స్తంభిస్తున్నది. విశాఖ- అనకాపల్లి మధ్య రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు రెండు కిలోమీటర్ల దూరం వున్న నెహ్రూచౌక్ నుంచి సుంకరిమెట్ట జంక్షన్‌కు చేరుకోవడానికి 15 నిమిషాల నుంచి అరగంట వరకు సమయం పడుతున్నది. సమస్య ఇంత తీవ్రంగా వున్నప్పటికీ ట్రాఫిక్ పోలీసులు, మునిసిపల్ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల పార్కింగ్ కోసం కేటాయించిన సెల్లార్లను ఇతర అవసరాలకు వినియోగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



మెయిన్ రోడ్డులో ఫుట్‌పాత్‌ను ఆక్రమించిన దుకాణదారులు

రేషన్ బియ్యం పంపిణీలో చేతివాటం

స్థాయీ సంఘ సమావేశంలో పౌర సరఫరాల శాఖ అధికారులపై జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం

- ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలని సభ్యుల విజ్ఞప్తి
- అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- అధికారుల దృష్టికి తెచ్చిన జడ్పీటీసీ సభ్యులు
- ప్రధాన ఆస్పత్రుల్లో సేవలు సక్రమంగా అందడం లేదన్న మరికొందరు...

విశాఖపట్నం, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో కార్డుదారులకు బియ్యం పంపిణీలో డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం జడ్పీ హాలులో జరిగిన రెండు, నాలుగు స్థాయీ సంఘ సమావేశాలకు అధ్యక్షత వహిం చిన ఆమె..పౌర సరఫరాల శాఖపై చర్చలో పాల్గొన్నారు. గోదాముల నుంచి డీలర్లకు సరఫరా చేసే బియ్యం బస్తాలు ఉండాల్సిన బరువు కంటే ఐదారు కిలోలు తక్కువగా ఉంటున్నాయన్నారు. దాంతో కార్డుదారులకు కొంత తక్కువగా అందజేస్తున్నారని అన్నారు. ఇటీవల ఏజెన్సీలో పర్యటించినప్పుడు పలువురు కార్డుదారులు ఈ విషయమై తనకు ఫిర్యాదు చేశారన్నారు. మండల స్టాకు పాయింట్లుగా ఉన్న గోదాముల వద్ద పర్యవేక్షణ లేకపోవడంతో అక్కడ సిబ్బంది ప్రతి బస్తా నుంచి ఐదారు కిలోల బియ్యం తీసివేస్తున్నారన్నారు. దీనిపై వివరణ ఇచ్చేందుకు అల్లూరి సీతారామరాజు జిల్లా అధికారులు లేకపోవడంతో విశాఖ డీఎస్‌వో సూర్యప్రకాశరావు స్పందిస్తూ సంబంధిత అధికారుల దృష్టికి విషయాన్ని తీసుకువెళతానన్నారు. అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు డి.గంగరాజు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కూలీలకు సుమారు రూ.2.5 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉందని, అధికారులకు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దీనిపై విశాఖ జిల్లా సీఈవో ఎం.పోలినాయుడు స్పందిస్తూ తక్షణమే అల్లూరి సీతారామరాజు జిల్లా డ్వామా అధికారులకు నివేదించి బిల్లులు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. కాగా జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ఏజెన్సీలో మహిళా మార్టులు ఏర్పాటు చేయాలని కోరగా అల్లూరి సీతారామరాజు జిల్లా డీఆర్‌డీఏ అధికారి బదులిస్తూ ఐటీడీఏకు ప్రతిపాదనలు పంపామని కోరామన్నారు. ఈ దశలో సీఈవో పోలినాయుడు స్పందిస్తూ స్వయంశక్తి సంఘాలు పొదుపు చేసిన నిధుల నుంచి కొంత మొత్తం మార్టుల ఏర్పాటుకు ఇవ్వాలన్నారు.

గొలుగొండ జడ్పీటీసీ సభ్యుడు గిరిబాబు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు చేపట్టే లబ్ధిదారులకు త్వరితగతిన బిల్లులు చెల్లించాలని కోరగా అనకాపల్లి హౌసింగ్ పీడీ రమామణి బదులిస్తూ క్షేత్రస్థాయిలో ఇంజనీర్లు పనుల వివరాలు అప్‌లోడ్ చేసిన వెంటనే బిల్లులు చెల్లించడం జరుగుతుందన్నారు. ఎస్.రాయవరం జడ్పీటీసీ సభ్యురాలు కాకర దేవి మాట్లాడుతూ సొంత స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరుచేయాలని కోరారు. నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ మాట్లాడుతూ పాఠశాలల్లో నాడు-నేడు కింద చేపట్టిన పనులకు సకాలంలో బిల్లులు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో ప్రతిచోట పనులు సగంలో నిలిచిపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై విశాఖ జిల్లా సమగ్రశిక్షా అభియాన్ ఏపీసీ బి.శ్రీనివాసరావు స్పందిస్తూ, త్వరలో బిల్లులు విడుదలవుతాయని హామీ ఇచ్చారు. హుకుంపేట జడ్పీటీసీ సభ్యుడు రేగా మత్స్యలింగం మాట్లాడుతూ ఏజెన్సీలో అనేక గ్రామాల్లో ఇంకా పాకల్లోనే పాఠశాలలు నిర్వహిస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. పలుచోట్ల టీచర్లు పాఠశాలలకు వెళ్లకపోవడంతో విద్యార్థులు చదువులు సాఫీగా జరగడం లేదని ఆవేదన వ్యక్తంచేయగా, జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర స్పందిస్తూ ఏజెన్సీలో పాఠశాలలను తరచుగా సందర్శించాలని అధికారులను ఆదేశించారు.

వైద్య ఆరోగ్య శాఖపై జరిగిన చర్చలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాదు వెంకటప్పడు ... మిగతా 8వ పేజీలో



మాట్లాడుతున్న అనంతగిరి జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు

స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో పాతాళానికి 'పట్నం!

గత ఏడాదికంటే దారుణంగా పడి పోయిన ర్యాంకులు

- 2022లో స్టేట్ ర్యాంక్ 18, సౌత్ జోనల్ ర్యాంక్ 87
- 2023లో స్టేట్ ర్యాంక్ 59, సౌత్ జోనల్ ర్యాంక్ 140



23వ వార్డు గంగాధర్ థియేటర్‌కు వెళ్లే రోడ్డులో చెత్త కుప్ప

నర్సీపట్నం, జనవరి 11: స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్స్‌లో నర్సీపట్నం మునిసిపాలిటీ పాతాళానికి దిగజారింది. గత రెండు సంత్సరాలతో పోలిస్తే ర్యాంక్ దారుణంగా పడిపోయింది. రాష్ట్రస్థాయిలో 59వ ర్యాంకు, సౌత్ జోన్‌లో 140వ ర్యాంకులో నిలిచింది. పట్టణంలో ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ, మార్కెట్లు, ప్రజా మరుగుదొడ్లు, వార్డుల్లో పారిశుధ్యం నిర్వహణతోపాటు ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ ఆధారంగా స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు ఇస్తారు. నర్సీపట్నం మునిసిపాలిటీకి ఈసారి సౌత్ జోన్‌లో 140వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 59 ర్యాంక్ వచ్చాయి. 2022లో సౌత్ జోన్‌లో 87వ ర్యాంకు, రాష్ట్ర స్థాయిలో 18 ర్యాంక్ వచ్చాయి. దీనినిబట్టి చూస్తే రాష్ట్ర స్థాయిలో 41, సౌత్ జోన్ స్థాయిలో 53 ర్యాంకులు తగ్గాయి.

కారణాలు ఇవీ...

నర్సీపట్నం మునిసిపాలిటీలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. వారంలో ఒకటి, రెండు రోజులు తప్పితే ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. సాలిడిల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఉన్నప్పటికీ దీనిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి అధికారులు ప్రయత్నం చేయడం లేదు. సేంద్రియ ఎరువుల తయారీ నామమాత్రంగా మారింది. ఇందిరా మార్కెట్‌లో చెత్తను డంపింగ్ చేయడం వల్ల స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోవడం లేదు. దీంతో డ్రైనేజీ కాలువలు, రోడ్ల మీద ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి.

రసవత్తరంగా వైసీపీ రాజకీయం

మూడో జాబితాలోనూ అనకాపల్లి ఎంపీ అభ్యర్థిని ప్రకటించని అధిష్ఠానం

- ప్రచారంలో రకరకాల పేర్లు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఎక్కడో స్థానం?



గుడివాడ అమర్‌నాథ్



డాక్టర్ సత్యవతి

(విశాఖపట్నం/అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి జిల్లాలో వైసీపీ రాజకీయం రసవత్తరంగా మారింది. పార్టీ అధిష్ఠానం గురువారం రాత్రి 21 మంది అభ్యర్థుల పేర్లతో మూడో జాబితా విడుదల చేసింది. అయితే అందులో అనకాపల్లి జిల్లా నుంచి ఒక్క స్థానం కూడా లేకపోవడం గమనార్హం. అనకాపల్లి ఎంపీ స్థానంతో పాటు పెందుర్తి, చోడవరం అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులను మారుస్తారని గత కొద్దిరోజులుగా ప్రచారం జరుగుతోంది. అనకాపల్లి ఎమ్మెల్యే జిల్లా మంత్రి గుడివాడ్ అమర్‌నాథ్‌కు ఎక్కడి నుంచి అవకాశం ఇస్తారో ఇంకా స్పష్టత రాలేదు. పెందుర్తి నుంచి అవకాశం ఇస్తారని ఊహాగానాలు వచ్చాయి. అక్కడ స్థానిక ఎమ్మెల్యే అదీప్‌రాజ్‌ను మారుస్తారని చెప్పుకొచ్చారు. కానీ ఆయన బుధవారం తాడేపల్లి వెళ్లి సీఎం జగన్‌ను కలిశారు. ఈ నేపథ్యంలో ఆయనకే మళ్లీ అవకాశం ఇస్తామని చెప్పినట్టు గురువారం ప్రచారం జరిగింది. ఒకవేళ అదే నిజమైతే మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు సీటు ఎక్కడ కేటాయిస్తారో చూడాలి. తాజా పరిణామాలతో చోడవరం నుంచి అవకాశం కల్పించవచ్చునని ప్రచారం మొదలైంది. అయితే అక్కడి ఎమ్మెల్యే ధర్మశ్రీకి ఎక్కడ ఇస్తారనేది ప్రశ్నగా మారింది. ఆయన్ను అనకాపల్లి ఎంపీగా పోటీ చేయమంటున్నారని కొందరు చెబుతున్నారు. కానీ అనకాపల్లి ఎంపీగా ఆడారి తులసీరావు కుమార్తె పిల్లా రమాకుమారి పేరు పరిశీలనలో ఉందని సమాచారం. అదే కుటుంబంలో తులసీరావు కుమారుడు ఆడారి ఆనంద్‌కుమార్‌కు విశాఖ పశ్చిమ నుంచి పోటీ చేయడానికి గ్రీన్‌సిగ్నల్ ఎప్పుడో వచ్చేసింది. ఒకే కుటుంబంలో ఇద్దరికి టిక్కెట్లు ఇస్తారా?...అని కొందరు అనుమానాలు వ్యక్తంచేస్తున్నారు. లేదంటే..గవర సామాజిక వర్గంలో ఇంకెవరికైనా అవకాశం ఇవ్వవచ్చునంటున్నారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొడ్డేటి ప్రసాద్, నర్సీపట్నం నియోజకవర్గ పరిశీలకులు బొడ్డేటి కాశీ విశ్వనాథం అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేయాలని ఉవ్విళ్లూరుతున్నారు. ఇదిలావుండగా సిట్టింగ్ ఎంపీ డాక్టర్ సత్యవతి మరోమారు తనకు అవకాశం ఇవ్వాల్సిందిగా పార్టీ పెద్దలను కోరారు. ఒకవేళ సమీకరణాల వల్ల ఎంపీ సీటు ఇవ్వలేకపోతే అసెంబ్లీ టికెట్ అయినా ఇవ్వాలని ఆమె కోరుతున్నారు.

విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మి

వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం ఎంపీ అభ్యర్థిగా మంత్రి బొత్స సత్యనారాయణ భార్య ఝాన్సీలక్ష్మి పేరును అధిష్ఠానం ఖరారు చేసింది. లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆమెను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. విజయనగరం జిల్లాకు చెందిన ఝాన్సీలక్ష్మి ఆ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రెండుసార్లు, బొబ్బిలి, విజయనగరం ఎంపీగా ఒక్కోసారి పనిచేశారు. 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి విజయనగరం ఎంపీగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. తర్వాత ఆమె భర్త బొత్స సత్యనారాయణ వైసీపీలో చేరగా, 2019 ఎన్నికల్లో ఆమెకు పోటీచేసే అవకాశం దక్కలేదు. 2024 ఎన్నికల్లో ఆమె విజయనగరం ఎంపీగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపగా, విశాఖ నుంచి ఎంపీగా బరిలోకి దింపాలని పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది.

జయహో బీసీ చైతన్యయాత్ర

అనకాపల్లి టౌన్, జనవరి 11 : తెలుగుదేశం పార్టీ 'జయహో బీసీ చైతన్యయాత్ర' వాహనాలను గురువారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు ప్రారంభించారు. టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి సీనియర్ నేతలు బండారు సత్యనారాయణమూర్తి, పీలా గోవింద సత్యనారాయణ, పీవీజీ కుమార్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, వైసీపీ పాలనలో బీసీలపై దాడులు, అరాచకాలు పెరిగాయన్నారు. బడ్జెట్‌లో బీసీలకు కేటాయించిన నిధులను దారి మళ్లించి, బీసీ కార్పొరేషన్‌లను నిర్వీర్యం చేసి వైసీపీ ప్రభుత్వం బీసీల ద్రోహిగా మారిందన్నారు. జగన్‌రెడ్డి నియంతత్వ పోకడలు, అరాచక పాలన, వైసీపీ నేతల ఇసుక, గనులు, ఖనిజాలు, గ్రావెల్ దోపిడీ, భూ ఆక్రమణల గురించి ప్రజలకు వివరించడానికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో బీసీ చైతన్యయాత్ర లు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయ కులు భీమరశెట్టి శ్రీనివాసరావు, మళ్ల సురేంద్ర, గుర్రం నూకరాజు, గింజల లక్ష్మణరావు, బత్తుల లక్ష్మి, వనం శ్రీనివాసరావు, ఆడారి కిశోర్‌కుమార్, జూరెడ్డి రాము తదితరులు పాల్గొన్నారు.



బీసీ చైతన్యయాత్ర వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న బుద్ద నాగజగదీశ్వరరావు

చోడవరంలో యువకుడి ఆత్మహత్య?

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఓ ఇంటి కిటికీ ఊచలకు ఉరివేసుకుని అఘాయిత్యం

- మృతదేహం వేలాడుతున్న తీరుపై కుటుంబ సభ్యులు అనుమానాలు
- ఆత్మహత్య కాదు.. హత్య అని పోలీసులకు ఫిర్యాదు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు
- ప్రేమ విఫలం కావడమే కారణమని ప్రచారం



కిటికీ ఊచలకు వేలాడుతున్న మృతదేహం (ఇన్‌సెట్‌లో) ప్రశాంత్ (ఫైల్ ఫొటో)

చోడవరం, జనవరి 11: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ఓ ఇంటి కిటికీ ఊచలకు యువకుడొకరు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. చని పోయిన యువకుడు బుచ్చెయ్యపేట మండలం వడ్డాదికి చెందిన పత్తి ప్రశాంత్(24)గా గుర్తించి అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం వేలాడుతున్న తీరునుబట్టి ఆత్మహత్య కాదని, హత్య అని కుటుంబ సభ్యులతోపాటు స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఆయన వెల్లడించిన వివరాలిలా వున్నాయి.

బుచ్చెయ్యపేట మండలం వడ్డాది గ్రామానికి చెందిన పత్తి ప్రశాంత్(24) పాడేరులో కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. సంక్రాంతి పండగ సందర్భంగా వడ్డాది వచ్చిన ఇతను కొత్తబట్టలు కొనుక్కునేందుకు స్నేహితులతో కలిసి బుధవారం విశాఖపట్నం వెళ్లాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరిగి చోడవరం చేరుకున్నారు. తనకు ఇక్కడ పని ఉందని స్నేహితులకు చెప్పి, ప్రశాంత్ చోడవరంలోనే ఉండిపోయాడు. గురువారం ఉదయం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక రిటైర్డ్ ఉద్యోగికి చెందిన నివాసాల్లో ఓ ఇంటి కిటికీ ఊచలకు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం వేలాడుతున్న తీరును చూస్తే ఆత్మహత్య చేసుకున్నట్టుగా లేదని, కచ్చితంగా ఇది హత్యేనని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఆ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అనుమనాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

ప్రేమ విఫలం కావడమే కారణమా?

ఇదిలావుండగా ప్రేమ విఫలం కావడంతోనే ప్రశాంత్ ఆత్మహత్య చేసుకుని వుంటాడని ప్రచారం జరుగుతున్నది. విజయవాడలో ఇంజనీరింగ్ చదువుతున్న బుచ్చెయ్యపేట మండలానికి చెందిన ఓ విద్యార్థినికి, ప్రశాంత్‌కు మధ్య కొంతకాలంగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్టు చెబుతున్నారు. ఆ యువతి కుటుంబ సభ్యులు చోడవరానికి మకాం మార్చి, ఇక్కడ ఇల్లు అద్దెకు తీసుకుని వుంటున్నట్టు తెలిసింది. అయితే ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు రావడంతో ఆమె ప్రశాంత్‌ను దూరం పెట్టినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఆ యువతి విజయవాడ నుంచి చోడవరం వచ్చినట్టు తెలియడంతో ప్రశాంత్ బుధవారం రాత్రి విశాఖ నుంచి తిరుగు ప్రయాణంలో వడ్డాది వెళ్లకుండా చోడవరంలోనే వుండిపోయాడు. తెల్లవారేసరికి ఆ యువతి కుటుంబ సభ్యులు నివాసం వుంటున్న ఇంటికి సమీపంలోనే ఉరివేసుకుని శవమై కనిపించాడు.

కాగా ప్రశాంత్ మొబైల్ ఫోన్ కాల్ డేటా, వాట్సాప్ చాటింగ్‌ను పోలీసులు పరిశీలించారు. చివరి కాల్స్ ఆ యువతికి చేసినట్టు, ఆమెతో మాట్లాడినట్టు గుర్తించారు. తనను ఎందుకు దూరం పెడుతున్నావంటూ ఆవేదన వ్యక్తం చేయడంతోపాటు తాను చనిపోతానని, అనంతరం తన తల్లిని నువ్వే చూసుకోవాలంటూ యువతిని ఉద్దేశించి చేసిన సంభాషణను వాట్సాప్ ఛాటింగ్‌లో గుర్తించారు. దీంతో ప్రశాంత్ ఆత్మహత్య చేసుకుని వుండొచ్చని పోలీసులు భావిసున్నారు. కానీ మృతదేహం వేలాడుతున్న తీరునుబట్టి చూస్తే కచ్చితంగా హత్యే అని కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

వయోవృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఆప్షన్

- ఎన్నికల కమిషన్ వెసులుబాటు: ఆర్డీవో

నర్సీపట్నం, జనవరి 11 : ఎనభై సంవత్సరాలు దాటిన వారికి కేంద్ర ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినయోగించుకునే అవకాశం కల్పించిందని ఆర్డీవో జయరాం చెప్పారు. గురువారం వయోవృద్ధుల సంక్షేమ సంఘం, ప్రభుత్వ పింఛన్‌దారుల సంఘం సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివిధ కారణాల వల్ల 80 ఏళ్లు దాటిన వారిలో 40-50 శాతం మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకుంటున్నట్టు ఎన్నికల కమిషన్ గుర్తించిందన్నారు. అందరూ ఓటు హక్కు వినయోగించుకోవడానికి వయో వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ఆప్షన్ ఇచ్చిందని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించు కోవచ్చునని, రాలేని వారు పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకోవచ్చునని తెలిపారు. బీఎల్‌వో 80 సంవత్సరాలు దాటిన వారి వద్దకు వెళ్లి ఆప్షన్ తెలుసుకుంటారనిఇ అన్నారు. వయోవృద్ధులతోపాటు నడవ లేని స్థితిలో ఉన్న దివ్యాంగులకు కూడా పోస్టల్ బ్యాలెట్ అవకాశం వుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రభుత్వ పెన్షన్‌దారుల సంఘం అధ్యక్షుడు గజ్జాలమ్మ, సినియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యదర్శి కేవీ సుబ్బారావు, తహసీల్దార్ అన్నాజీరావు, ఎలక్షన్ డీటీ సుధావాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

కలర్‌ఫుల్ : రంగులమయమైన నారా చంద్రబాబు నాయుడు కాలనీలోని టెన్నిస్ కోర్టు



హరివిల్లు.. సిరిజల్లు..

వైభవంగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీల ఫైనల్స్



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

"ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహించిన కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్‌బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు, రియల్ పార్టనర్స్ స్వర్గసీమ సుకేతన" ఫైనల్స్ గురువారం విజయవాడలో అంగ'రంగుల' వైభవంగా జరిగాయి. బెంజిసర్కిల్ సమీపంలోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ టెన్నిస్ కోర్టులో జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల స్థాయిలో విజేతలుగా నిలిచిన మహిళలతో పాటు తమిళనాడు, కర్ణాటక విజేతలు కూడా పాల్గొన్నారు. తమ సృజనతో ముత్యాల ముగ్గుల్లో రంగుల దృశ్యాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జరిగిన బహుమతుల ప్రదానోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేయగా, ఉమ్మడి కృష్ణా జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనూరాధ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. కెనరా బ్యాంక్ విజయవాడ సర్కిల్ ఏజీఎం జీవీ నరసింహారావు, కెనరా బ్యాంక్ మార్కెటింగ్ సర్కిల్ సీనియర్ మేనేజర్ శిరీష, 'ఆంధ్రజ్యోతి' న్యూస్ ఎడిటర్ నాగసుధాకర్, 'ఆంధ్రజ్యోతి' విజయవాడ యూనిట్ మేనేజర్ వి.మురళీ, ఏబీఎన్ ఏపీ బ్యూరో బి.రామారావు, యాడ్స్ ఏజీఎం టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా అబ్బూరి రత్నలక్ష్మి, మల్లెల శుభప్రద వ్యవహరించారు. - ఆంధ్రజ్యోతి, విజయవాడ

ప్రథమ బహుమతి గెలుచుకున్న విజయనగరం జిల్లా మహిళ

గుంటూరు, అనంతపురం, తమిళనాడు మహిళలకు ద్వితీయ బహుమతులు

11 మందికి కన్సొలేషన్ బహుమతులు

బహుమతులు ప్రదానం చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి



పరిశీలన : ముగ్గులను పరిశీలిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

రెండుసార్లు రాష్ట్రస్థాయి బహుమతి పొందా..



నేను టైలరింగ్ చేస్తాను. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నప్పటి నుంచీ పాల్గొంటున్నా. హైదరాబాద్‌లో నిర్వహించిన పోటీల్లో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి సాధించాను. తర్వాత 2023లో నిర్వహించిన పోటీల్లో రెండోసారి ప్రథమ బహుమతిని పొందాను. మళ్లీ ఇప్పుడు ద్వితీయ బహుమతి పొందా.

- కె.ఉమాదేవి, అనంతపురం జిల్లా

ద్వితీయ బహుమతి విజేతలు

ఐదేళ్లుగా ముగ్గులు వేస్తున్నా



మాది సత్తెనపల్లి వద్ద ఉన్న ధూళిపాళ్ల గ్రామం. ఐదేళ్లుగా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో పాల్గొంటున్నాను. జిల్లాస్థాయి పోటీల్లో రెండుసార్లు ప్రథమ బహుమతి సాధించాను. 2020లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లోనూ మొదటి స్థానం నాదే.

- ఏ.సునీత, గుంటూరు జిల్లా

పదేళ్లుగా పోటీల్లో ఉంటున్నా..



కర్ణాటక, తమిళనాడు సరిహద్దుల్లో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీల్లో ఏటా నేను పాల్గొంటా. పదేళ్లుగా నేను ముగ్గులు వేస్తున్నా. తొలిసారిగా రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నా. ఈ పోటీల్లో ద్వితీయ బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.

- రాధ, తమిళనాడు



విజేతలు వీరే.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి నుంచి ద్వితీయ బహుమతులు అందుకుంటున్న ఏ.సునీత (గుంటూరు), కె.ఉమాదేవి (అనంతపురం), కె.రాధ (తమిళనాడు), కన్సొలేషన్ బహుమతులు అందుకుంటున్న ఆర్.ఆశాజ్యోతి (శ్రీకాకుళం), బి.లక్ష్మి (విశాఖపట్నం), టి.ఆదిశ్రీ (పశ్చిమగోదావరి), మల్లీశ్వరి (తూర్పుగోదావరి), పి.పూజిత (కృష్ణా), ఎం.సునీత (నెల్లూరు), పీహెచ్ మణిమంజరి (ప్రకాశం), విద్య (చిత్తూరు), ఎస్.శ్వేత (కడప), ఎస్.రాజేశ్వరి (కర్నూలు), లిఖిత (కర్ణాటక)

క్రైం... crime news

పాము కాటుతో బాలుడి మృతి



గల్లా గిరిధర్ (ఫైల్ ఫొటో)

రావికమతం, జనవరి 11: తల్లిదండ్రులతో కలిసి పొలానికి వెళ్లిన బాలుడు పాము కాటుకు గురయ్యాడు. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు వెల్లడించారు. రావికమతం మండలం గుడివాడ పంచాయతీ శివారు మట్టవానిపాలెం గ్రామానికి చెందిన గల్లా మహేశ్, మహాలక్ష్మమ్మ దంపతులకు దిలీప్‌కుమార్, గిరిధర్ కుమారులు వున్నారు. సంక్రాంతి సందర్భంగా పాఠశాలలకు సెలవులు ఇవ్వడంతో గురువారం మధ్యాహ్నం తల్లిదండ్రులతో కలిసి గ్రామానికి సమీపంలో ఉన్న పొలానికి వెళ్లారు. భార్యాభర్తలు పొలంలో పనులు చేస్తుండగా, పిల్లలు పాక వద్ద ఆడుకుంటున్నారు. ఈ సందర్భంగా గిరిధర్ పాకలోకి వెళ్లాడు. అప్పటికే పాకలో పశుగ్రాసం కిందున్న పాము.. గిరిధర్‌ను కాటు వేసింది. దీంతో గిరిధర్ పెద్దగా కేకలు వేయడంతో తల్లిదండ్రులు ఒక్క ఉదుటన పాక వద్దకు వచ్చారు. వెంటనే రావికమతం పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమంగానే వుండడంతో 108 అంబులెన్స్‌లో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు అయ్యారు.

రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి మృతి

పరవాడ, జనవరి 11 : ఎలమంచిలి - గాజువాక ప్రధాన రహదారిలోని దేశపాత్రునిపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉక్కు ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ములకలపల్లి శంకరరావు(51) స్టీల్‌ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉక్కునగరంలోని సెక్టార్-1లో నివాసం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం పరవాడలో గల స్నేహితుడిని కలిసి వస్తానని ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. రాత్రి ఎనిమిదిన్నర గంటల సమయంలో తిరిగి ఇంటి వెళుతుండగా దేశపాత్రునిపాలెం రైల్వే బ్రిడ్జి వద్ద రహదారికి అడ్డంగా పంది రావడంతో దానిని ఢీకొట్టి కిందపడిపోయారు. దీంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి ఆయనను రహదారి పక్కన కూర్చొబెట్టి మంచినీరు పట్టారు. తరువాత అక్కడి నుంచి అందరూ వెళ్లిపోయారు. కాగా శంకరరావు మృతి చెందిన విషయాన్ని ఆయన బంధువు రాము గురువారం ఉదయం గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అక్కడ చేరుకున్న వారికి రాత్రి జరిగిన విషయాన్ని స్థానికులు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తానాంలో పట్టపగలు చోరీ

పరవాడ, జనవరి 11: మండలంలోని తానాంలో గురువారం పట్టపగలు చోరీ జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు ప్రవేశించి బీరువాలో ఉన్న తులంన్నర బంగారం, రూ.40 వేలు నగదు అపహరించుకుపోయారు. సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కింతాడ బాలాజీరావు కిరాణాషాపు నిర్వహిస్తున్నాడు. గురువారం సరకుల కోసం విశాఖపట్నం వెళ్లగా, భార్య ముత్యాలమ్మ షాపు దగ్గర ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమె భోజనానికి ఇంటికి వెళ్లగా ప్రధాన ద్వారం తెరిచి ఉంది. కంగారుపడి ఇంటి లోపలికి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉంది. దానిలో వుంచిన తులంన్నర బంగారం, రూ. 40వేలు నగదు అపహరణకు గురైనట్టు గుర్తించింది. పోలీసులకు సమాచారమిచ్చారు. క్లూస్‌టీమ్ అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్ఐ తేజేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	75.00
లైవ్ ధర	95.00
విత్ స్కిన్	160.00
స్కిన్ లెస్	170.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	59
విజయనగరం	603
శ్రీకాకుళం	603

మహిళా మార్టు వద్ద ఆందోళన



మహిళా మార్టు వద్ద వెలుగు అధికారులను నిలదీస్తున్న సీఐటీయూ అధ్యక్షురాలు వరలక్ష్మి

- ద్వాక్రా సభ్యులతో బలవంతపు కొనుగోళ్లపై అధికారులను నిలదీసిన ఐద్వా, సీఐటీయూ నేతలు
- వెలుగు, డీఆర్‌డీఏ సిబ్బంది తీరుపై ఆగ్రహం

చోడవరం, జనవరి 11: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ఆధ్వర్యంలో ఇక్కడ ఏర్పాటు చేసిన మహిళా మార్టులో ప్రతి ఒక్క డ్వాక్రా మహిళ జనవరి నెలలో కచ్చితంగా రూ.2 వేల సరకులు కొనుగోలు చేయాలని వీవోఏలు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ ఐద్వా, సీఐటీయూ ఆధ్వర్యంలో మహిళలు గురువారం స్థానిక మహిళా మార్టు వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు గూనూరు వరలక్ష్మి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని అన్ని డ్వాక్రా సంఘాల సభ్యులు చోడవరంలో ఉన్న మహిళా మార్టుకు వచ్చి సరకులు కొనుగోలు చేయాలని వెలుగు వీవోలు, ఏపీవోలు ఒత్తిడి చేస్తున్నారని, సుదూరంలో వున్న గ్రామాల నుంచి వ్యయప్రయాసలతో చోడవరం వెళ్లి సరకులు కొనలేమని మహిళలు వాపోతున్నారని అన్నారు. అయినాసరే వీవోలు, ఏపీవోలు ఒప్పుకోకుండా డ్వాక్రా మహిళలు దాచుకున్న పొదుపు సొమ్ము నుంచి రూ.2 వేల చొప్పున తీసేసుకుని, మహిళా మార్టులో సరకులు తీసుకెళ్లక తప్పదని ఒత్తిడి చేయడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. డ్వాక్రా సభ్యుల అనుమతి లేకుండా వారి ఖాతాల నుంచి డబ్బులు తీసుకోవడమే కాకుండా సరకులు కొనని సభ్యులకు బ్యాంకు రుణాలు ఇచ్చేది లేదని వెలుగు సిబ్బంది బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే వున్న వెలుగు ఏపీఎం మాట్లాడుతూ, డ్వాక్రా సభ్యుల నుంచి తాము బలవంతంగా డబ్బులు తీసుకోవడం లేదని, సరకులు కావలసిన సభ్యులు మాత్రమే మార్టులో కొనుగోలు చేయాలని సూచిస్తున్నామని సమాధానం ఇచ్చారు. దీనిపై తీవ్రంగా స్పందించిన మహిళా సంఘాల నేతలు.. అవసరం లేని వారి చేత బలవంతంగా సరకులు కొనుగోలు చేయించడం సరికాదని, డ్వాక్రా సభ్యుల నుంచి ఫిర్యాదు వస్తే మహిళలతో కలిసి మార్టును ముట్టడిస్తామని స్పష్టం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సీఐటీయూ, ఐద్వా నాయకులు రామలక్ష్మి, బుచ్చిరాజమ్మ, రమణమ్మ, రాధ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేతనాల కోసం రోడ్డెక్కిన పారిశుధ్య కార్మికులు

చోడవరం, జనవరి 11: వేతన బకాయిలు చెల్లించాలంటూ చోడవరం మేజర్ పంచాయతీ పారిశుధ్య కార్మికులు గురువారం రోడ్డెక్కారు. పంచాయతీ కార్యాలయం ఎదుట రహదారిపై మానవహారంగా ఏర్పడి నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజు మాట్లాడుతూ, కార్మికులకు ఐదు నెలల వేతనాలు అందాల్సి వుందని, సంక్రాంతి పండగ సందర్భంగా వేతనాలు ఇప్పించాలని కోరుతున్నా పంచాయతీ అధికారులు స్పందించకపోవడంతో కార్మికులు ఆందోళనకు దిగారని చెప్పారు. కాగా పారిశుధ్య కార్మికుల ఆందోళనతో ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది. సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వచ్చి పంచాయతీ అధికారులు, కార్మికులతో చర్చలు జరిపారు. ప్రస్తుతానికి ఒక నెల వేతనం ఇవ్వడానికి పంచాయతీ అధికారులు అంగీకరించారు. దీంతో పారిశుధ్య కార్మికులు తాత్కాలికంగా ఆందోళన విరమించారు.



చోడవరంలో ప్రధాన రహదారిపై మానవహారంగా ఏర్పడి ఆందోళన చేస్తున్న పంచాయతీ పారిశుధ్య కార్మికులు

పోలీసులతో మందుబాబులు గొడవ.. లాఠీచార్జి

చోడవరం, జనవరి 11: పట్టణంలోని చినబజారువీధిలో ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద గురువారం రాత్రి మందుబాబులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చోటుచేసుకొంది. వివాదం ముదరడంతో పోలీసులు లాఠీచార్జికి దిగారు. కాగా ఇక్కడ మద్యం దుకాణంతోపాటు పక్కనే ఉన్న ఇతర షాపుల వద్ద మందుబాబులు మందు సేవిస్తుండడంతో తాము ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఫిర్యాదు చేస్తుండడంతో పోలీసులు ఇటీవల పలువురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు పెట్టడం, పోలీస్ స్టేషన్‌కు తీసుకుని వెళ్లి కూర్చోపెడుతుండడం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి కొంతమంది మందుబాబులు మద్యం దుకాణం వద్దకు వచ్చి, ప్రభుత్వం దుకాణంలో మందు తాగుతుంటే కేసులు రాస్తున్నారని, అటువంటప్పుడు ఇక్కడ మద్యం దుకాణం ఎందుకు ఏర్పాటు చేశారంటూ గొడవకు దిగి దుకాణాన్ని మూసివేయించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే పోలీసుల తీరుతో ఆగ్రహంతో ఉన్న మందుబాబులు, పోలీసులతో గొడవకు దిగారు. దీంతో పోలీసులు లాఠీచార్జి చేసి మందుబాబులను చెదరగొట్టారు. ఈ వ్యవహారంపై స్థానిక సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ, చినబజారువీధి వద్ద మద్యం దుకాణం వద్దనుకుంటే దానిని వేరేచోటకు తరలించాలని అధికారులకు సూచిస్తామని చెప్పారు.



పోలీసులతో గొడవపడుతున్న మందుబాబులు

రాష్ట్ర ఏపీ సీపీఎస్ఈఏ అధ్యక్షుడిగా కోరుకొండ సతీశ్



కోరుకొండ సతీశ్

బుచ్చెయ్యపేట/తుమ్మపాల, జనవరి 11: రాష్ట్ర ఏపీ సీపీఎస్ఈఏ అధ్యక్షుడిగా అనకాపల్లి జిల్లా తురకలపూడికి చెందిన కోరుకొండ సతీశ్ ఎన్నికయ్యారు. ఏపీ సీపీఎస్ఈఏ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఆయన 2017లో పనిచేశారు. విశాఖ జిల్లా కేంద్రంగా సాగర్ ర్యాలీ వంటి కార్యక్రమాలను ఆయన నిర్వహించారు. అనేక ఉద్యమాల్లో అయన పాల్గొన్నారు. కోరుకొండ సతీశ్ ఎన్నిక పట్ల జిల్లా సంఘం నాయకులు ఎం.ఉమామహేశ్వరరావు, గాడి సూర్య ప్రకాశ్, మోటూరు త్రినాథ్‌స్వామి, ఉమామహేశ్వరి, సుబ్బారావు, చుక్కల రాము, గునూరు బ్రహ్మ, దేవుడుబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తల్లి అయిన అరకు ఎంపీ మాధవి

కొయ్యూరు, జనవరి 11 : అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి బుధవారం రాత్రి పడంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. బుధవారం సాయంత్రం వరకు విశాఖపట్నంలోని పార్టీ కార్యాలయంలో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె రాత్రి 9 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా పురుటి నొప్పులు వచ్చాయి. వెంటనే ఎంపీ వ్యక్తిగత సిబ్బంది ఈ విషయాన్ని ఆమె భర్త శివప్రసాద్‌కు తెలియపరిచారు. ఆయన సలహా మేరకు మధురవాడలో శ్రీసత్య ఆస్పత్రికి తరలించారు. రాత్రి 10 గంటల సమయంలో శస్త్ర చికిత్స ద్వారా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్టు కుటుంబీకులు తెలిపారు.

జిల్లాలో 13,244 మందికి జగనన్న తోడు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 11 : జగనన్నతోడు పథకం ఎనిమిదవ విడత కింద జిల్లాలోని 13,244 మంది లబ్ధిదారులకు రూ.14 కోట్ల ఒక లక్ష 33 వేల రూపాయలు జమ చేసినట్టు కలెక్టర్ రవిపట్టన్‌శెట్టి పేర్కొన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి తాడేపల్లి నుంచి గురువారం జగనన్నతోడు పథకం కింద రుణాలు పొంది సకాలంలో చెల్లించిన లబ్ధిదారులకు మళ్లీ రుణాలను పంపిణీ చేసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా, శంకరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి కలెక్టర్ రవి పట్టన్‌శెట్టితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొని సీఎం ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి లబ్ధిదారులకు మంజూరైన చెక్కులను అందజేసి మాట్లాడారు. చిరు వ్యాపారులు, సంప్రదాయ వృత్తుల వారి ఉపాధికి ఊతంగా జగనన్నతోడు నిలుస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ వరహా సత్యవతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు వరకు పొడిగింపు

విశాఖపట్నం, జనవరి 11: విశాఖ, విజయవాడ మధ్య రాకపోకలు సాగించే ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సర్వీసులను ఈనెల 13వతేదీ నుంచి గుంటూరు వరకు పొడిగిస్తున్నట్టు సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి తెలిపారు. దీంతో 22701 నంబరు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం 5.20 గంటలకు విశాఖలో బయలుదేరి 11.25 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 1.00 గంటలకు గుంటూరు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 22702 నంబరు గల ఉదయ్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 4.00 గంటలకు గుంటూరులో బయలుదేరి 5.05 గంటలకు విజయవాడ, రాత్రి 10.55 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు దువ్వాడ, అనకాపల్లి, తుని, సామర్లకోట, రాజమండ్రి, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

బిహార్ వాసి ఆత్మహత్య

అనకాపల్లి టౌన్, జనవరి 11: బిహార్‌కు చెందిన పరీష్ మంజి(39) అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీదేవిపేట శివారు పంట పొలాల్లో మామిడిచెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీనిపై వీఆర్వో పి.నాగరాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న క్లూస్ బృందం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి విచారణ ప్రారంభించామని ఎ పట్టణ ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. క్లూస్ బృందం తనిఖీల్లో మృతుడి జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా అతని పేరు పరీష్‌మంజిగా గుర్తించామని తెలిపారు. ఆధార్ ఆధారంగా గయా ప్రాంత పోలీసులకు వివరాలు తెలియజేశామన్నారు. మృతుడి కుటుంబ సభ్యులు అనకాపల్లికి బయలుదేరారని ఆయన తెలిపారు. గురువారం తెల్లవారుజామున పరీష్ మంజి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గోవాడలో వ్యక్తి ఆత్మహత్య

చోడవరం, జనవరి 11: మండలంలోని గోవాడ గ్రామంలో నాగు అనే మెకానిక్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతని ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు వచ్చి ఇంట్లోకి వెళ్లి చూశారు. నాగు చనిపోయి ఉండడం కనిపించింది. ఇతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం : పీలా గోవింద

కశింకోట, జనవరి 11 : తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకువస్తామని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ హామీ ఇచ్చారు. గురువారం మండల కేంద్రంలో జయహో బీసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరుచూరి భాస్కరరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా ఏపీలోనే బీసీలపై దాడులు జరుగుతున్నాయని, అందుకే బీసీల రక్షణ చట్టం కోసం ప్రత్యేక బీసీ చట్టం తీసుకువస్తామని చెప్పారు.టీడీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, నాయకులు ఉగ్గిన రమణమూర్తి, మాదంశెట్టి నీలబాబు, పెంటకోట రాము, గుర్రం నూకరాజు పాల్గొన్నారు.

వేల్పులవీధి గౌరమ్మ ఉత్సవ పత్రిక ఆవిష్కరణ

అనకాపల్లి టౌన్, జనవరి 11 : ప్రఖ్యాతిగాంచిన స్థానిక వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఉత్సవ పత్రికను గురువారం ఆలయం వద్ద కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి ఆవిష్కరించారు. ఈనెల 20వ తేదీన ఉత్సవం నిర్వహించనున్నట్టు కమిటీ పేర్కొంది. ఈ సందర్భంగా కార్పొరేటర్ జాజుల ప్రసన్న, రమేశ్‌లను ఉత్సవ కమిటీ సత్కరించింది. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వాకాడ బాబు, మద్దాల నూకరాజు,ఉపాధ్యక్షులు శీరంశెట్టి నరసింగరావు, కోశాధికారి వేల్పుల గణేశ్ పాల్గొన్నారు.

శేష వాహనంపై శ్రీనివాసుడు

నక్కపల్లి, జనవరి 11: ఉపమాక క్షేత్రంలో ధనుర్మాసం నీరాటోత్సవాల్లో భాగంగా గురువారం ఇత్తడి శేష వాహనంపై శ్రీనివాసుడు భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా ఆలయానికి ఆనుకుని వున్న పుష్పతోటలో గోదాదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. తదుపరి ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని శేష వాహనంపై అలంకరించగా, రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారిని అలంకరించి మాడవీధుల్లో ఊరేగించారు.

చంద్రబాబు సభలకు విశేష స్పందన : బుద్ద

అనకాపల్లి, జనవరి 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్న రా కదలిరా.. టీడీపీ బహిరంగ సభలకు ప్రజల నుంచి విశేషమైన స్పందన లభిస్తోందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్దా నాగజగదీశ్వరరావు ఒక ప్రకటనలో అన్నారు. బొబ్బిలిలో జరిగిన భారీ బహిరంగసభకు ఉప్పెనలా ప్రజలు పాల్గొని విజయవంతం చేయడం వైసీపీ జగన్‌రెడ్డి పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనబడుతోందన్నారు. జగన్‌రెడ్డి ఓడిపోతామని తెలుసుకుని అభ్యర్థుల ఖరారులో గందరగోళం సృష్టిస్తున్నారన్నారు. మినీ మేనిఫెస్టో 6 గ్యారంటీ పథకాల కోసం ప్రజల మంచి స్పందన వస్తోందన్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ కేజీహెచ్‌లోని భవనగర్ వార్డులో రోగులకు వరండాల్లో బెడ్లు వేస్తున్నారని ఆరోపించారు. నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ నర్సీపట్నం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలని రెండేళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నర్సీపట్నం ఆస్పత్రిలో కొందరు వైద్యులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జోక్యం చేసుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో వైద్య సేవల కోసం ప్రజా ప్రతినిధులు ఫోన్ చేస్తే స్పందించేలా సెల్ ఒకటి ఏర్పాటుచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు వారం రోజుల్లో బిల్లులు మంజూరుచేస్తామన్నారు. ప్రస్తుతం ఆరేడు కోట్ల నిధులు ఉన్నాయని పేర్కొంటూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. కాగా మిగిలిన స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై సభ్యులు చర్చించారు.





అంగన్‌వాడీల వినూత్న నిరసన

చెవిలో పువ్వులు పెట్టుకొని.. ఒంటి కాలిపై .. మోకాళ్లపై నిలబడి ఆందోళన


పరవాడలో చెవిలో పువ్వులు పెట్టుకుని అంగన్‌వాడీల నిరసన


సబ్బవరంలో ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

పరవాడ, జనవరి 11 : తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు చెవిలో పువ్వులు పెట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు అక్కమ్మ, రమణి, దేవి, ఈశ్వరమ్మ, సత్య, ఉమా పాల్గొన్నారు.

ఒంటి కాలిపై జపం చేస్తూ..

సబ్బవరం: అంగన్‌వాడీల సమ్మె గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు ఒంటి కాలిపై జపం చేస్తూ వినూత్నంగా నిరసన తెలిపారు. ప్రాజెక్టు అధ్యక్షురాలు వీవీ రమణమ్మ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డం తగదన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు డి.పుష్పావతి, ఆర్ఎస్ రామలక్ష్మి, ఎస్ జగదేశ్వరి, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

మునగపాకలో.. అంగన్‌వాడీలు గురువారం వినూత్నరీతిలో ఒంటికాలిపై నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ తమ డిమాండ్లు సాధించేవరకూ పోరాడతామని, నోటీసులకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రామలక్ష్మి, అంజలి, హేమలత, సరస్వతీ, సత్యవతి, బేబీ పాల్గొన్నారు.

సాష్టాంగ నమస్కారాలతో..

అచ్యుతాపురం: అంగన్‌వాడీలు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించండిఇ మహాప్రభో అంటూ సాష్టాంగ నమస్కారాలతో నిరసనను తెలిపారు. తమపై వివక్ష చూపడం ప్రభుత్వానికి తగదన్నారు.

మోకాళ్లపై నిలిచి..

రాంబిల్లి: అంగన్‌వాడీలు చేస్తున్న ఆందోళన గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మోకాళ్లపై నిలిచి దండం పెడుతూ.. మాకు న్యాయం చేయండి అని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. 31 రోజులు సమ్మె చేయడంతో 31 ఆకారంలో కూర్చొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకులు మంగ, సుజాత, నూకరత్నం, సంతోషి పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలో అంగన్‌వాడీల సమ్మె 31వ రోజు కొనసాగింది. గురువారం నెహ్రూ చౌక్‌లోని బస్టాప్ వద్ద శిబిరాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వానికి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు కాసులమ్మ, తనూజ, ఉమా నారాయణమ్మ పాల్గొన్నారు.

పాయకరావు పేట: అంగన్‌వాడీల సమ్మె గురువారం 31వ రోజుకు చేరింది. ఏపీ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించిన అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎస్మా చట్టం ప్రయోగించినా భయపడేదిలేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బి.నాగేశ్వరరావు, నూకరత్నం, సత్యవేణి, తులసీ, ఎస్‌వీఆర్ఎ.రాజేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.


మునగపాకలో ఒంటికాలిపై నిల్చుని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



అచ్యుతాపురంలో సాష్టాంగ నమస్కారంలో అంగన్‌వాడీల నిరసన

దేశానికే ఆదర్శప్రాయుడు అంబేడ్కర్ : కలెక్టర్

తుమ్మపాల, జనవరి 11 : దేశానికే ఆదర్శప్రాయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. సామాజిక సమత సంకల్ప కార్యక్రమంలో భాగంగా గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించారు. అంబేడ్కర్ జననం, బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, రాజ్యాంగ రచన తదితర ఘట్టాలకు సంబంధించిన ఛాయా చిత్రాలను ఫొటో ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బీవీ సత్యవతి, ఎంపీపీ గొర్లి సూరిబాబు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి

వైసీపీ అరాచక పాలనను అంతమొందించాలి

» జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి

పాయకరావుపేట రూరల్, జనవరి11: వైసీపీ అరాచక, అవినీతి పాలనను అంతమొందించాలని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి అన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల జనసేన పార్టీ అధ్యక్షులను గురువారం గుంటపల్లిలో గెడ్డం బుజ్జి సత్కరించి, అభినందించారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ సిద్ధాంతాలు, టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలలోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులుగా నియమించిన జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేశ్‌బాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాయకరావుపేట మండల అధ్యక్షుడు యగదాసు నానాజీ, నక్కపల్లి మండల అధ్యక్షుడు వెలగా సుధాకర్, ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు పప్పల శివ, కోటవురట్ల మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీను, పాయకరావుపేట పట్టణ అధ్యక్షులుగా ఆచంట దొర, జనసేన పార్టీ నాయకులు గెడ్డం కన్నబాబు, జగ్గన్నదొర, పల్లి దుర్గారావు, పవన్, నల్లల రత్నాజి, తుమ్మల గణేష్, తదితరులు పాల్గొన్నారు.


మండల పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారిని సత్కరిస్తున్న గెడ్డం బుజ్జి

విధులకు హాజరైన పారిశుధ్య కార్మికులు

అనకాపల్లి టౌన్, జనవరి 11 : సమస్యల పరిష్కారాన్ని కోరుతూ సమ్మెకు దిగిన జీవీఎంసీ అనకాపల్లి జోన్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు గురువారం నుంచి విధుల్లోకి చేరారు. పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో కార్మికులు నిమగ్నమయ్యారు. ఉదయం జీవీఎంసీ కమిషనర్‌తో కార్మిక సంఘం నాయకులు చర్చలు జరిపారు. ప్రభుత్వం సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సంఘ నాయకులు పేర్కొన్నారు. సమస్యలను ఈ నెల 30వ తేదీ లోపు పరిష్కరిస్తామని చెప్పారని, పూర్తిస్థాయిలో సమస్యలు పరిష్కారం చేయకపోతే మరలా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కాంట్రాక్టు కార్మికులు, మేస్త్రీలకు ఇతర పనులు అప్పగించడం వల్ల పారిశుధ్యం పనులు చేసే కార్మికులపై పనిభారం పడుతుందని, వారిని వెంటనే పారిశుధ్య పనులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, జి.సత్యనారాయణ, గంటా శ్రీరామ్, కార్మికులు బొమ్మల రాము, నిమ్మకాయల అజయ్‌కుమార్, నూకరాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


ఉడ్‌పేటలో చెత్త తొలగిస్తున్న కార్మికులు


గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్న అక్రమార్కులు

పంచదార్లలో గ్రావెల్ తవ్వకాలు

రాంబిల్లి, జనవరి 11 : మండలంలోని పంచదార్లలోని కొండ వద్ద అక్రమార్కులు దర్జాగా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. పట్టపగలు గ్రావెల్‌ను ట్రాక్టర్లపై తరలిస్తున్నారు. జగనన్న ఇళ్ల పునాదులు కంపేందుకంటూ అక్రమార్కులు అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ గ్రావెల్‌కు ధరను నిర్ణయించి అమ్మకాలు చేస్తున్నారు. గ్రావెల్ తవ్వకందారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంగన్‌వాడీలపై ఎస్మా రద్దు చేయాలి

» రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

అనకాపల్లి టౌన్, జనవరి 11: అంగన్‌వాడీలపై విధించిన ఎస్మాను తక్షణమే రద్దు చేయాలని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించి జీతాలను పెంచాలని గురువారం దొడ్డి రామునాయుడు భవనంలో నిర్వహించిన వివిధ రాజకీయ ఎపార్టీల రౌండ్‌టేబుల్ సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్. శంకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్‌లను సంక్రాంతి పండగలోపు పరిష్కరించాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించాయి. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు లక్షల మందికి పైగా పిల్లలు, మహిళలు, గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారన్నారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని 31 రోజులుగా అంగన్‌వాడీలు సమ్మె చేస్తుంటే పరిష్కారం చూపకుండా ఎస్మాను ప్రయోగించడం దుర్మార్గమన్నారు. సమావేశంలో రాజాన దొరబాబు (సీపీఐ), పావాడ కామరాజు (జనసేన), వెంకటరావు (టీడీపీ), వైఎన్ భద్రం (సీపీఐ), గంటా శ్రీరామ్ (సీపీఎం), కట్టమూరి నూకఅప్పారావు (కాంగ్రెస్), శ్రీనివాసరావు (ఆమ్‌ఆద్మీ), ప్రజా సంఘాలు, రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

ఐక్య పోరాటాలతో విజయం : సీఐటీయూ

అనకాపల్లి టౌన్, జనవరి 11 : ఐక్య పోరాటాల ద్వారానే విజయం సాధిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి జి. కోటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు ఫలించడంతో సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 22 రోజులుగా చేస్తున్న సమ్మెను విరమించి, గురువారం విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమ్మె ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు ఐక్యంగా పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని, ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ధర్నా శిబిరంలో మృతి చెందిన జడ్డు వాసుదేవరావుకు, ఇదే సమయంలో మృతి చెందిన కోటేశ్వరమ్మకు సమావేశం నివాళులర్పించింది. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు, జేఏసీ నాయకులు పూడి వెంకటరావు, అచ్యుతకృష్ణ పాల్గొన్నారు.

టౌన్‌ప్లానింగ్ అక్రమాలపై విచారణ జరపాలి

అనకాపల్లి టౌన్, జనవరి 11 : జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లోని టౌన్‌ప్లానింగ్ విభాగంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని మున్సిపల్ శాఖ మంత్రికి, చీఫ్ ప్లానింగ్ ఆఫీస్‌లకు ఫిర్యాదు చేసినట్టు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ విల్లూరి పైడారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టౌన్‌ప్లానింగ్ అధికారుల అండదండలతో అనకాపల్లిలో విచ్చలవిడిగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మున్సిపల్ రికార్డుల్లో 1084/1 సర్వే నంబరు ట్యాంక్ స్థలంగా ఉండడంతో ఎటువంటి నిర్మాణాలు చేయకూడదని సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ అక్కడ అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. వీటిపై ఫిర్యాదులు ఇచ్చినా చర్యలు తీసుకోలేదన్నారు. అధికారుల తీరుపై విచారణ జరిపించాలని జీవీఎంసీ కమిషనర్, చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అక్రమ కట్టడాలకు అండగా టౌన్‌ప్లానింగ్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడి పందాలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఎస్.రాయవరం, జనవరి 11: సంక్రాంతి పండగను పురస్కరించుకుని కోడి పందాలు నిర్వహించడానికి పలువురు సిద్ధమవుతున్నారు. ఎస్. రాయవరం, లింగరాజుపాలెం, దార్లపూడి, సైతారుపేట, గుడివాడ, పెదగుమ్ములూరు, కోనవానిపాలెం, గెడ్డపాలెం, గోకులపాడు, వమ్మవరం, సోముదేవుపల్లి, జేవీ పాలెం, వెంకటాపురం తదితర గ్రామాల్లో పెద్ద ఎత్తున కోడి పందాలు నిర్వహించే అవకాశం ఉండడంతో వీటిపై పోలీసులు దృష్టి సారించారు. కోడి పందాలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ప్రసాదరావు హెచ్చరించారు.

నూకాంబికా ఆలయంలో అన్న సమారాధన

ఎలమంచిలి, జనవరి 11: స్థానిక బస్టాండ్ సమీపంలోని నూకాంబికా అమ్మవారి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని ప్రతి ఏటా వలె భక్తుల విరాళాలతో అన్న సమారాధనను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చిన ఈ కార్యక్రమానికి చైర్‌పర్సన్ రమాకుమారి సైతం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బెల్లం తయారీ పాక దగ్ధం

కశింకోట, జనవరి 11: మండల కేంద్రంలో ప్రమాదవశాత్తూ బెల్లం తయారీకి చేసిన పాకం, కమ్మల పాక దగ్ధమైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి బాధిత రైతు బొడ్డేడ శ్రీను, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. శారదానది అవతల ఉన్న బెల్ల తయారీ కేంద్రంలో మధ్యాహ్నం బెల్లం పాకం ఆడుతుండగా పెద్దగా వీచిన గాలికి చెరకు తుక్కు నుంచి మంటలు ఒక్కసారిగా చెలరేగాయి. అప్పటికే క్రషర్‌లో బెల్లం పాకం తయారు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో పాక పూర్తిగా దగ్ధమైంది.

ఘనంగా బాలకార్మికుల పునరావాస వారోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి సాయికుమారి, తదితరులు

ఎలమంచిలి, జనవరి 11: పట్టణంలో గురువారం బాల కార్మికుల పునరావాస వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రైల్వేస్టేషన్ వద్ద అధికారులు అశోక్, సురేశ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఏ.సాయికుమారి పాల్గొని పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ గఫూర్, పట్టణ ఎస్ఐ పాపినాయుడు, ఏజీపీ డి.వెంకటరావు, లోక్‌అదాలత్ మెంబరు పీవీ.రమణ, న్యాయవాదులు, కోర్టుసిబ్బంది పాల్గొన్నారు.

గ్రీన్ అంబసిడార్లకు వేతనాలు వెంటనే చెల్లించాలి

అచ్యుతాపురం, జనవరి 11: పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబసిడార్లకు వెంటనే వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము డిమాండ్ చేశారు. గురువారం ఆయన దిబ్బపాలెం పంచాయతీ అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబసిడార్లతో పాటు ఎలక్ట్రీషియన్లకు 13 నెలలుగా జీతాలు ఇవ్వడంలేదు. వెంటనే వీరికి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

జనసేన మండల అధ్యక్షుడిగా పరశురాం



మునగపాక, జనవరి 11: జనసేన పార్టీ మండల అధ్యక్షుడిగా టెక్కలి పరశురామ్‌ని నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా పరశురామ్ విలేకరులతో మాట్లాడుతూ తనను అధ్యక్షుడిగా నియమిస్తూ మరోసారి ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు.

మాజీ సర్పంచ్‌కు వైసీపీ నాయకుల పరామర్శ

పాయకరావుపేట రూరల్, జనవరి11: మండలంలోని కేశవరం మాజీ సర్పంచ్ మేడిశెట్టి రాముని గురువారం రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు పరామర్శించారు. రాము తండ్రి మాజీ సర్పంచ్ మేడిశెట్టి సూర్యారావు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ఈ సందర్భంగా రాము కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మేడిశెట్టి రామగోవిందు, వైసీపీ నాయకులు కోడా కోటేశ్వరరావు, చేపల తాతాజీ, యజ్జల అన్నవరం, పల్లెల వెంకట్ పాల్గొన్నారు.

ఆస్పత్రి కార్మికుల వేతనాలు చెల్లించాలని నిరసన

అనకాపల్లి టౌన్, జనవరి 11 : బకాయిపడిన జీతాలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయంలో కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి కోన లక్ష్మణ మాట్లాడుతూ కార్మికులకు బకాయిపడిన మూడు నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై వైద్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావును కలిసి మాట్లాడగా రెండు నెలల జీతాలు కార్మికులకు చెల్లిస్తామని హామీ ఇచ్చినట్టు లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో వరప్రసాద్, వడ్డాది పోలారావు, ఈశ్వరరావు, ఝాన్సీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

'అంధులకు స్ఫూర్తిదాత లూయిస్ బ్రెయిలీ'

పరవాడ, జనవరి 11 : అంధులకు లూయిస్ బ్రెయిలీ స్ఫూర్తిదాతగా నిలుస్తున్నారని వైసీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, దివ్యాంగుల జిల్లా శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి అన్నారు. స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటు చేసిన లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకల్లో వారు పాల్గొని మాట్లాడారు. తొలుత బ్రెయిలీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం దివ్యాంగులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సాధన కార్యదర్శి ఇస్మాయిల్, ఎస్.అర్జునరావు, పైలా అప్పలనాయుడు పాల్గొన్నారు.

రామమందిరం ప్రారంభానికి సింహాద్రి జీజీఎంకు ఆహ్వానం

పరవాడ, జనవరి 11 : ఈనెల 22న అయోధ్యలో జరగనున్న రాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠలో పాల్గొనాలని కోరుతూ సింహాద్రి జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హాకు గురువారం బీజేపీ పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ గొర్లి రామునాయుడు ఆహ్వానపత్రిక, అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగదీశ్వరరావు, సోమశేఖర్, రామకృష్ణ పాల్గొన్నారు.

బాలికా సాధికారతకు ఎన్టీపీసీ కృషి

» సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా

పరవాడ, జనవరి 11 : బాలికా సాధికారత కోసం సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం ఎంతగానో కృషి చేస్తుందని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా తెలిపారు. బాలికా సాధికారత మిషన్‌లో భాగంగా మండలంలో 13 ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి చదువుతున్న 110 మంది విద్యార్థినులకు సింహాద్రి దీపాంజలినగర్ బాలభారతి పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన రెండు రోజుల వింటర్ వర్క్‌షాపును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ అధికారులు బీబీ పాత్ర, ఎన్.గడ్డం, కె.ప్రకాశరావు, బాలభారతి పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ పద్మజ పాల్గొన్నారు.

డైట్ విద్యార్థికి సుజనావాణి స్కాలర్‌షిప్

అనకాపల్లి టౌన్, జనవరి 11: స్థానిక డైట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి సిమ్మ జయంత్‌కు సుజనావాణి వాలంటీర్ అసోసియేషన్ స్కాలర్‌షిప్ రూ. 14వేలు అందిందని సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి దేవీప్రసాద్ గురువారం తెలిపారు. మూడు వేల మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా.. కేవలం 192 మందికి మాత్రమే స్కాలర్‌షిప్ లభించిందని, అందులో డైట్ కళాశాల విద్యార్థి ఉండడం విశేషమన్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్, ప్రిన్సిపాల్ ఆర్. వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు అభినందించారు.

'టీడీపీ అధికారంలోకి వస్తే అదుపులోకి ధరలు'

తుమ్మపాల, జనవరి 11 : రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్మోహన్‌రెడ్డి పెంచిన ధరలను అదుపులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకోనున్నట్టు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా గురువారం 84వ వార్డులో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రానికి పట్టిన వైసీపీ జబ్బుకు టీడీపీ, జనసేన పొత్తే వ్యాక్సిన్ అని అన్నారు. జగన్మోహన్‌రెడ్డి రహిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే టీడీపీ, జనసేన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మాదంశెట్టి నీలబాబు, కొణతాల రత్నకుమారి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలను తరిమికొట్టాలి

పరవాడ, జనవరి 11 : వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను తరిమికొట్టాలని టీడీపీ నాయకులు పైలా రథాల సన్యాసిరావు, లోకిరెడ్డి అబి సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. వెన్నెలపాలెంలో గురువారం రాత్రి బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి టీడీపీ మినీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొంప మారునాయుడు, పైలా ప్రసాద్, బోజంకి నాయుడు, బండారు వీరునాయుడు, కె.శ్రీను పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రాంబిల్లి, జనవరి 11 : మండలంలోని మామిడివాడ ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎంపీపీ జి.శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శిరీష మాట్లాడుతూ రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియో గం చేసుకోవాలన్నారు. ఏవో సుమంత మాట్లాడుతూ ధాన్యం ఎ గ్రేడ్ క్వింటా రూ.2,203 కాగా కామన్ రకానికి క్వింటాకు రూ.2,183 చెల్లించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు జి.శ్రీనుబాబు, సర్పంచ్ ఎం.అప్పలనర్స ఎంపీటీసీ సభ్యులు శానాపతి సన్యాసిరావు, అల్లవరపు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం



భీమబోయినపాలెంలో భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మాకవరపాలెం, జనవరి 11 : మండలంలోని భీమబోయినపాలెం, తామరం గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రెండు విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే గణేశ్ గురువారం ప్రారంభించారు. అనంతరం తామరంలో విశాఖ డెయిరీ నిధులతో చేపడుతున్న కల్యాణం మండపం నిర్మాణానికి డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో సీతామహాలక్ష్మి, వైసీపీ మండల అధ్యక్షుడు రుత్తల వాసు, ఉమెన్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వరలక్ష్మి, తామరం సర్పంచ్ చెల్లారత్నం తదితరులు పాల్గొన్నారు.

'అభివృద్ధి పనులకు అడ్డంకులు తగదు'

నర్సీపట్నం, జనవరి 11 : మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు మాజీ మంత్రి అయ్యన్న అడ్డంకులు సృష్టిస్తున్నారని ఎమ్మెల్యే గణేశ్ ఆరోపించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ముఖ్యమంత్రి జగన్ మునిసిపాలిటీలో 17 సచివాలయాలకు సుమారు రూ.5 కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం 38 అభివృద్ధి పనులు జరక్కుండా స్టే తెచ్చారని ఆరోపించారు. రోడ్డు విస్తరణ పనులకు చాలా మందితో కోర్టులో కేసులు వేయించి అడ్డంకులు సృష్టించారని పేర్కొన్నారు.

రెండు చోట్ల బెల్లం ఊట ధ్వంసం

నాతవరం/కృష్ణాదేవిపేట, జనవరి 11 : మండలంలోని కేపీ శరభవరం, చినజగ్గంపేట ప్రాంతాల్లో ఎస్ఐ రామారావు ఆధ్వ ర్యంలో పోలీసులు గురువారం సారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సారా తయారీకి సిద్ధంగా ఉంచిన నాలుగువేల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారీకి సంబంధించిన సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

అలాగే గొలుగొండ మండలం పాత కృష్ణాదేవిపేట సమీపంలో కొండపై చెట్ల మధ్యన ఎనిమిది వందల లీటర్ల బెల్లం ఊటను గురువారం ధ్వంసం చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ ఎం.ఉపేంద్ర తెలిపారు.

టీడీపీ అంటే అభివృద్ధి ... వైసీపీ అంటే అరాచకాలు

▸▸ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ▸▸ ఎమ్మెల్యే గణేశ్ ఇసుక, గనుల వ్యాపారం చేస్తూ అక్రమ ఆర్జన చేస్తున్నారని ఆరోపణ





బూరుగుపాలెంలో మాట్లాడుతున్న చింతకాయల విజయ్.., పాతమల్లంపేటలో కౌన్సిలర్ రాజేశ్‌కు స్వాగతం

మాకవరపాలెం, జనవరి 11 : టీడీపీ అంటే అభివృద్ధి, సంక్షేమం అని.. వైసీపీ అంటే అరాచకాలు.. అక్రమాలు.. అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ ఎద్దేవా చేశారు. బూరుగుపాలెంలో గురువారం రాత్రి బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించి తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ హయాంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయన్నారు. ప్రస్తుత వైసీపీ పాలనలో ఆ పరిస్థితి లేదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలను అమలుచేసి తీరుతామని స్పష్టం చేశారు. నర్సీపట్నం ఎమ్మెల్యే ఇసుక, గనులు వ్యాపారం చేస్తూ అక్రమ సంపాదన చేపట్టారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడ్ని భారీ మెజార్టీతో గెలిపించాలని విజయ్ కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, మండల శాఖ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి చిరంజీవి, టీడీపీ సీనియర్ నాయకులు అల్లు రామునాయుడు, శేషుకుమార్, జోగుబాబు, దుంగల రమణ, గోవింద, పోతల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ : రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయమే లక్ష్యంగా అంతా పనిచేయాలని మాజీ మంత్రి అయ్యన్న సతీమణి, మునిసిపల్ కౌన్సిలర్ పద్మావతి పిలుపునిచ్చారు. మండలంలోని పాకలపాడులో గురువారం ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అలాగే పాతమల్లంపేటలో ఏర్పాటైన సమావేశంలో అయ్యన్న తనయుడు, మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర సర్వనాశనమైందని ఎద్దేవా చేశారు. మండల తెలుగు యువత ఉపాధ్యక్షుడు గెడ్డం ఆనంద్, టీడీపీ నాయకులు భీమిరెడ్డి అచ్యుతసూర్యనారాయణ, మామిడి ఆదిలక్ష్మి, గెడ్డం నానాజీ, ఆదపురెడ్డి గోపీ, కామిరెడ్డి రామన్న పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట : రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ గొలుగొండ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి కొంగసింగిలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అయ్యన్న తనయుడు రాజేష్ హాజరై మాట్లాడారు. వైసీపీ హయాంలో రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సరైన గుణపాఠం చెప్పాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో కొంగసింగి సర్పంచ్ ఎలమంచిలి నూకరత్నం, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, నాయకులు యలమంచిలి వరహాలబాబు, మల్లేష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె



సీఐటీయూ అక్షర రూపంలో అంగన్‌వాడీలు ప్రదర్శన

నర్సీపట్నం, జనవరి 11 : డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీలు చేపడుతున్న సమ్మె గురువారం 31వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఇక్కడి ఎన్టీఆర్ మినీ స్టేడియంలో కార్మిక సంఘం సీఐటీయూ అక్షర రూపంలో ప్రదర్శన ఇచ్చి నిరసన తెలిపారు. సదరు యూనియన్ నాయకుడు అడిగర్ల రాజు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు జరిపి అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సామ్రాజ్యం, మహాలక్ష్మి, వరలక్ష్మి తదితరులతో పాటు పెద్ద సంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



గొలుగొండ దీక్షా శిబిరంలో అంగన్‌వాడీలు

గొలుగొండ, జనవరి 11 : మండల కేంద్రం గొలుగొండలో ఏర్పాటైన దీక్షా శిబిరంలో గురువారం గొలుగొండ, నాతవరం మండలాలకు చెందిన అంగన్‌వాడీలు నినాదాలు చేశారు. న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించేవరకు ఆందోళనను విరమించేది లేదని స్పష్టం చేశారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు సంఘీ భావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు మంగతాయారు, భ్రమరాంబ, సత్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి అందజేత

నర్సీపట్నం అర్బన్, జనవరి 11 : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను గురువారం ఇక్కడ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్ ఆయా బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, నర్సీపట్నం మండలాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి ఎండు గడ్డి దగ్ధం

నాతవరం జనవరి 11 : ఏపీపురం గ్రామ సమీపంలో ఎడ్ల బండిపై ఎండు గడ్డిని తీసుకుని వెళుతుండగా, ప్రమాదవశాత్తూ వేలాడుతున్న విద్యుత్ వైర్లు తగిలి గడ్డి దగ్ధమైంది. పైల సత్యనారాయణ అనే రైతుకు చెందిన గడ్డిని తీసుకు వెళుతుండగా ఈ ఘటన చోటుచేసుకుంది.

జనసేన మండల అధ్యక్షుల నియామకం

నర్సీపట్నం అర్బన్, జనవరి 11 : గ్రామస్థాయిలో జనసేన పటిష్టతకు అంతా కృషి చేయాలని ఆ పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ సమన్వయకర్త రాజాన వీరసూర్యచంద్ర పిలుపునిచ్చారు. గురువారం ఇక్కడ ఏర్పాటైన సమావేశంలో మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ ఆశయాలకు అనుగుణంగా అంతా పనిచేయాలన్నారు. అనంతరం పార్టీ గొలుగొండ మండల అధ్యక్షుడిగా గండెం దొరబాబు, నాతవరానికి వెలగల వెంకటరమణ, మాకవరపాలేనికి సేనాపతి శేషు, నర్సీపట్నం రూరల్ అధ్యక్షుడిగా మోపాడ చిరంజీవిని పార్టీ అధిష్ఠానం నియమించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు అద్దేపల్లి గణేశ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

నర్సీపట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో పార్కు



పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన పార్కు

నర్సీపట్నం, జనవరి 11 : పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ గణేశ్ పార్కు నిర్మాణం చేయించారు. అందమైన పూల మొక్కలతో పాటు క్రోటన్స్, నీడనిచ్చే మొక్కలు నాటించారు. సందర్శకులు సేదదీరేందుకు అనువుగా బెంచీలు ఏర్పాటు చేసి, చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించారు. అందులో బుద్ధుడి విగ్రహం పెట్టారు. త్వరలో పార్కు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. పోలీస్ మైదానంలో వాకింగ్ కోసం వచ్చే వారికి, పిల్లలకు ఈ పార్కు చాలా వరకు ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

రేషన్ బియ్యం పంపిణీలో చేతివాటం

... 5వ పేజీ తరువాయి

మాట్లాడుతూ కేజీహెచ్‌లోని భవనగర్ వార్డులో రోగులకు వరండాల్లో బెడ్లు వేస్తున్నారని ఆరోపించారు. నర్సీపట్నం జడ్పీటీసీ సభ్యురాలు రమణమ్మ మాట్లాడుతూ నర్సీపట్నం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించాలని రెండేళ్ల నుంచి కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. నర్సీపట్నం ఆస్పత్రిలో కొందరు వైద్యులు సక్రమంగా పనిచేయడం లేదన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర జోక్యం చేసుకుని ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ఆస్పత్రుల్లో వైద్య సేవల కోసం ప్రజా ప్రతినిధులు ఫోన్ చేస్తే స్పందించేలా సెల్ ఒకటి ఏర్పాటుచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులను ఆదేశించారు. సమావేశంలో జడ్పీ సీఈవో పోలినాయుడు మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టే పనులకు వారం రోజుల్లో బిల్లులు మంజూరుచేస్తామన్నారు. ప్రస్తుతం ఆరేడు కోట్ల నిధులు ఉన్నాయని పేర్కొంటూ త్వరితగతిన పనులు పూర్తిచేయాలని కోరారు. కాగా మిగిలిన స్థాయీ సంఘ సమావేశాల్లో పలు అంశాలపై సభ్యులు చర్చించారు.

చోడవరం
నియోజకవర్గం

సింహగిరికి గిరిజనుల పాదయాత్ర



రావికమతం చేరుకున్న గిరిజనుల శాంతి యాత్ర

రావికమతం, జనవరి 11: సింహాద్రప్పన్న మాలలు ధరించి దీక్షలు పూర్తి చేసుకున్న గిరిజనులు చింతపల్లి నుంచి సింహాచలం కొండకు కాలినడకన బయలుదేరారు. చింతపల్లికి చెందిన వంద మందిగిరిజనులు సింహాద్రప్పన్న మాలలు ధరించి, దీక్షలు అనంతరం స్వామి దర్శనానికి మంగళవారం చింతపల్లిలో కాలినడకన బయలుదేరారు. గురువారం నాటికి రావికమతం చేరుకున్నారు. శుక్రవారం నాటికి సింహాచలం చేరుకొనిఇ స్వామి వారి దర్శనం అనంతరం అక్కడే మాల విసర్జన చేస్తామని గిరిజనులు తెలిపారు.

విధుల్లో చేరిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

రోలుగుంట, జనవరి 11 : గత 21 రోజులుగా సమ్మెలో ఉన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రభుత్వంతో చర్చలు ఫలించడంతో గురువారం విధుల్లో చేరారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యూటీ, ఉద్యోగ భద్రత కల్పించాలని తదితర అంశాలపై ప్రభుత్వంతో జరిపిన చర్చల్లో ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌సీ సిబ్బంది వేణు, సత్తిబాబు, నూర్పి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

రామాలయం విశిష్టతను తెలిపేందుకు పాదయాత్ర

రోలుగుంట, జనవరి 11 : అయోధ్య శ్రీరామ మందిరం ప్రారంభోత్సవం, స్వామివారి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రామాలయం విశిష్టతను తెలియజేసేందుకు శ్రీ పాకలపాడు గురుదేవుల ఆశ్రమ భక్తులు పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర గురువారం రోలుగుంట మీదుగా సాగింది. దీంతో పాటు విశ్వశాంతి, లోక కల్యాణం, సనాతన ధర్మ పరిరక్షణార్థం ఈ యాత్ర చేపడుతున్నట్లు భక్తులు తెలిపారు. ఈ యాత్ర సింహాచలం వరకు సాగుతుందని తెలిపారు.

మండల స్థాయి కబడ్డీ విజేత రాజాం

బుచ్చెయ్యపేట, జనవరి 11: ఆటాడుదాం ఆంధ్ర పోటీల్లో భాగంగా దిబ్బిడి జడ్పీ హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీల్లో రాజాం జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. పోటీలో మొత్తం 22 జట్లు పాల్గొనగా, రాజాం జట్టు ప్రథమ స్థానంలోను, తైపురం జట్టు ద్వితీయ స్థానంలోను నిలిచాయి.

రీ సర్వేలో తప్పులుంటే సరిచేసుకోండి : తహసీల్దార్



రత్నంపేటలో మాట్లాడుతున్న తహసీల్దార్ వరహాలు

రోలుగుంట, జనవరి 11 : రీసర్వే పూర్తయిన గ్రామాల్లో పాస్ పుస్తకాల్లో తప్పులు ఉంటే సరిచేసుకోవడానికి జిల్లా కలెక్టర్ అవకాశం ఇచ్చారని తహసీల్దార్ కె.వరహాలు కోరారు. గురువారం రత్నంపేటలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడారు. రైతులు సవరణల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇప్పటికే గంగవరం, బీజీపేట, పనసలపాడు, బీబీపట్నం, వెదుళ్లవలస, బుచ్చెంపేట, కంచుగుమ్మల, రోలుగుంట గ్రామాల్లో రీసర్వే పూర్తయ్యిందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో అప్పారావు, ఆర్ఐ రామమూర్తి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో చోడవరం తిరోగమనం

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతయ్యబాబు



బుచ్చెయ్యపేట, జనవరి 11: చోడవరం నియోజకవర్గంలో వైసీపీ 56 నెలల పాలనలో అభివృద్ధి తిరోగమనంలో పయనించిందని టీడీపీ చోడవరం నియోజకవర్గ ఇన్‌చార్జి బత్తుల తాతయ్యబాబు విమర్శించారు. గురువారం ఆయనిక్కడ విలేకర్లతో మాట్లా డుతూ.. నియోజకవర్గంలో ఏడు గ్రోయిన్‌ల అభివృద్ధికి రూ.12.5 కోట్లతో టెండర్లు ఖరారు చేసిన పనులు, ఇంటింటికి కొళాయి టెండర్లు వైసీపీ ప్రభుత్వం రివర్స్ పేరుతో రద్దు చేయడంతో సాగు, తాగునీటి సమస్యలతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదార్ల దుస్థితి చెప్పడానికి మాటలు చాలవన్నారు. టీడీపీ పాలనలో ప్రగతి పథంలో నిలిచిన గోవాడ సుగర్ ఫ్యాక్టరీ వైసీపీ పాలనలో అథమ స్థాయికి చేరుకుందని మండిపడ్డారు. చెరకు బకాయిల చెల్లింపుల విషయంలో మూడు నెలలుగా చోడవరం ఎమ్మెల్యే కె.ధర్మశ్రీ చేస్తున్న మోసపూరిత ప్రకటనలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్ సర్కార్‌ని రానున్న ఎన్నికల్లో ఓడించి, తెలుగుదేశం పార్టీకి పట్టం కట్టాలని ప్రజలు నిర్ణయించుకున్నారని తాతయ్యబాబు అన్నారు. బొబ్బిలిలో జరిగిన రా.. కదలిరా సభ విజయవంతం అయ్యిందని తాతయ్యబాబు తెలిపారు.

కోనాం సంతకు సంక్రాంతి శోభ



కోనాం సంతలో కుండలు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

చీడికాడ, జనవరి 11: మండలంలోని కోనాంలో గురువారం జరిగిన వారపు సంత సంక్రాంతి శోభ సంతరించుకుంది. సంతకు అధిక సంఖ్యలో ఏజెన్సీ, మైదాన ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో గిరిజన, గిరిజనేతరులు తరలివచ్చారు. ముఖ్యంగా ఏజెన్సీ గ్రామాలకు చెందిన గిరిజనులు పండగల నిమిత్తం కొత్తబట్టలు, కుమ్మరి కుండలతో పాటు వారానికి సరిపడా నిత్యావసర సరుకుల కొనుగోలులో పూర్తిగా నిమగ్నమయ్యారు. దీంతో చిరువ్యాపారులు బిజీ బిజీగా అమ్మకాలు సాగించారు. సాయంత్రం వరకూ సంతలో కిక్కిరిసిన జనం ఉండటంతో కోనాంలో సంక్రాంతి పండగ అప్పుడే ప్రారంభమైందని పలువురు భావిస్తున్నారు.

తూర్పుకాపు సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా పుల్లేటి గణేష్



జిల్లా అధ్యక్షుడి నుంచి నియామకపత్రం అందుకుంటున్న పుల్లేటి గణేష్

చోడవరం, జనవరి11: తూర్పు కాపు సంఘం మండల అధ్యక్షుడిగా అన్నవరానికి చెందిన పుల్లేటి గణేష్ నియమితులయ్యారు. గణేష్‌ను మండల శాఖ అధ్యక్షుడిగా నియమిస్తూ తూర్పుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు కరణం శ్రీహరి నియామకపత్రాన్నిఅందజేశారు. తూర్పు కాపుల సమస్యలు, సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తానని అధ్యక్షుడిగా నియమితులైన గణేష్ తెలిపారు. ఈయన నియామకం పట్ల వివిధ రాజకీయపార్టీలకు చెందిన ఎర్రంశెట్టి చిన్న, నానబెల్లి శ్రీను, పుల్లేటి వెంకటేష్, గూటాల సతీష్, గోకాడ శ్రీను, తూర్పుకాపు యువత హర్షం వ్యక్తం చేశారు.

వేతన బకాయిల కోసం కమ్యూనిటీ ఆసుపత్రి సిబ్బంది వినతి



ఆసుపత్రి వైద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న కోన లక్ష్మణ తదితరులు

చోడవరం, జనవరి 11: తమకు వేతన బకాయిలు చెల్లించాలంటూ స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి సిబ్బంది ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ ఆధ్వర్యంలో గురువారం ఆసుపత్రి వైద్యాధికారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ, ఆసుపత్రిలోని శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రతి నెలా 7లోగా వేతనాలు ఇవ్వాలన్నారు. సిబ్బందికి రావలసిన 2 నెలల వేతనాలు వెంటనే ఇప్పించాలని, కార్మికులకు పండగ పూట పస్తులు లేకుండా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ముచ్చు కోటేశ్వరరావు, ఉప్పిలి ప్రవీణ్, ఎం. కోటేశ్వరరావు, సుశీల, కుమారి, నూకరత్నం, నూకరాజు, లక్ష్మి, శ్రీను, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖండివరంలో లేగదూడల ప్రదర్శన

చీడికాడ, జనవరి 11: మండలంలోని ఖండివరంలో లేగదూడల ప్రదర్శనను పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.బి.రామ్మోహన్‌రావు గురువారం ప్రారంభించారు. ఈ పోటీలకు 40 మేలు జాతి పెయ్యిలు వచ్చాయి. ఇందులో మొదటిస్థానం సింగంపల్లి కాసుబాబు, రెండో స్థానం జూరెడ్డి గోవిందరావు, మూడో స్థానం దోకల నాయుడు నిలిచాయి. ఈ సందర్భంగా ఆయా రైతులకు బహుమతులు అందించారు. కాగా, ప్రభుత్వ కార్యక్రమానికి వైసీపీ, టీడీపీలకు చెందిన సూపర్ ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు వి.చిట్టినాయుడు, పశువైద్యాధికారులు ఎ.గణేష్ కుమార్, కేవీఎస్.రాఘవమ్మ, మణిలక్ష్మణ్, అరుణ్‌కిరణ్, మాజీ ఉపసర్పంచ్ సుంకరి శ్రీనివాసరావు, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం

హామీలు అమలులో వైసీపీ ప్రభుత్వం విఫలం : గవిరెడ్డి

దేవరాపల్లి, జనవరి 11: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమయిందని మాజీఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ రైతులు నష్టపోయినప్పటికీ పరిహారం నేటికి జమ కాలేదన్నారు. మద్య నిషేధం అంటూనే ఆ సొమ్ముతో సోకులు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల వారు విసుగు చెంది రోడ్లు ఎక్కే పరిస్థితి తీసుకు వచ్చారన్నారు. తెలుగుదేశం పార్టీ రా.. కదిలిరా, జనసేన పార్టీ పొత్తుతో ప్రజల్లో నూతన ఉత్తేజం వచ్చిందన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, వై.కరుణాకరరావు, అప్పలనాయుడు, శ్రీరామమూర్తి, గవిరెడ్డి దేమున్నాయుడు,అంజి,నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గణిత ప్రతిభా పరీక్షల్లో విజేతలకు బహుమతులు

దేవరాపల్లి, జనవరి 11: మండలంలోని తారువకి చెందిన అల్లు వారి కుటుంబం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షల్లో 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. నియోజకవర్గ స్థాయిలో 25 పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు తిమిరాం మదర్ థెరీసా స్కూల్‌లో పరీక్ష నిర్వహించారు. కైరళి ఇంగ్లీషు మీడియం విద్యార్థి పి.భవదీష్‌కు ప్రథమ బహుమతి లభించగా.. మిగిలిన బహుమతులు వివిధ పాఠశాలల విద్యార్థులకు దక్కాయి. కార్యక్రమంలో అల్లు గోపి, శ్రీనువాసరావు, అప్పలనాయుడు, సీహెచ్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

గాదిరాయిలో క్రికెట్ పోటీలు

మాడుగుల రూరల్, డిసెంబరు 30 : మండలంలోని గాదిరాయిలో నాయుడు క్రికెట్ టోర్నమెంట్(ఎన్‌సీటీ) పేరుతో మండల స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నారు. గాదిరాయి గ్రామానికి చెందిన పెచ్చెట్టి నాయుడు మృతి చెందడంతో ఆ యువకుని స్నేహితులు, కుటుంబ సభ్యులు ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో 32 జట్లు తలబడతున్నాయి. భోగి పండగ వరకు ఈ పోటీలు నిర్వహిస్తామని, ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు రూ.25వేలు, రూ.15వేలు, రూ.10వేలు అందిస్తామని నిర్వాహకులు తెలిపారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

మాడుగుల రూరల్, జనవరి 11 : పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేస్తున్నారు. కింతలి పశువైద్యాధికారి అరుణ కిరణ్ ఆధ్వర్యంలో ఎం.కోడూరు, శంకరం, పలు గ్రామాలకు 200 పశువులకు టీకాలు వేశారు. ఈ టీకా కార్యక్రమాన్ని మాడుగుల ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు చిట్టినాయుడు పర్యవేక్షించారు. ఇప్పటివరకు మండలంలో 3,996 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు, వైద్య సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

జనసేన క్యాలెండర్ ఆవిష్కరణ

కె.కోటపాడు, జనవరి 11: మండలంలోని కె.సంతపాలెం జనసేన నాయకుడు చుక్కా నారాయణమూర్తి ఆధ్వర్యంలో జనసేన పార్టీ క్యాలెండర్‌ను జనసేన మాడుగుల నియోజకవర్గ సమన్వయకర్త రాయపురెడ్డి కృష్ణ గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బి.సంతోష్, అంజిబాబు, మల్లునాయుడు,నరసింహమూర్తి, చిన్న రెడ్డి. శ్రీను, కె.సంతపాలెం జనసైనికులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలు విధుల్లో చేరాలి

చీడికాడ, జనవరి 11: అంగన్‌వాడీలు వెంటనే విధుల్లో చేరాలని వి.మాడుగుల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.చిన్నమ్మలు కోరారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద కార్యకర్తలు, ఆయాలు, మినీ వర్కర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి గృహాల తలుపులకు నోటీసులు అతికించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల మహిళ పోలీస్‌లు పాల్గొన్నారు.